# మంచు కరిగింది



**మంచు** వానలా కురుస్తూంది. వెన్నెల ఒలికిపోయిన పాలలా పరుచుకుంది. చలిగాలి రివ్వున వీస్తూంది. ప్రపంచమంతా నిద్రపోతూంది.అయినప్పటికీ ముత్యాలు వడివడిగా నడుస్తున్నాడు. అర్ధరాత్రి దాటింది.

కీచురాళ్ల పన్నాయి మోగుతూంది. నక్కల ఊళలు అప్పుడప్పుడు ఆ ప్రశాంత వాతావరణంలో మారుమోగుతున్నాయి. బండి బాటకు ఇరుపక్కలా ఉన్న పొదల్లోంచి మిణుగురులు తళుక్కుమంటున్నాయి.

యజమాని పనిమీద తాను పట్నం వెడుతూన్న సమయంలో గుడ్లనిండా నీరు నింపుకుని సాగనంపింది లచ్చి.

''బేగి తిరిగి రా, మావా'' అన్నది కళ్లు ఒత్తుకుంటూ.

''మూడు రోజుల్లో తిరిగొచ్చెయ్యనంటే! దిగులెట్టుకోకు'' అని కదిలాడు తను.

తనకుమాత్రం లచ్చిని వదిలి వెళ్లడం ఇష్టమా? స్వామికార్యం. తప్పదు. రెడ్డిగారి ఉప్పూ, పులుసూ తింటున్నాడు తను. అవసరమైనప్పుడు అక్కరకు రాకపోతే తనెందుకు?

'లచ్చికి నే నంటే ఎంత ఇష్టమో!' ముత్యాలు ఎన్ని కోట్లసార్లు ఇలా అనుకున్నాడో అతనికే తెలియదు. ఇప్పుడూ అనుకున్నాడు.

ఎక్కడో గుడ్లగూబ కూసింది. వడివడిగా నడుస్తూనే ఉన్నాడు ముత్యాలు.

పట్నంలో అనుకోకుండా ఆలస్యమైంది. అయిదు రోజులు. కాదు. అతనికి అయిదు యుగాలు.

లచ్చి సౌందర్యం అంతా అతని కళ్లముందు కదులుతూంది. లచ్చి సమక్షంలో వాలడానికి అతని హృదయం వేగిరపడుతూంది. కాళ్లు చురుగ్గా నడుస్తున్నాయి.

రైల్వే స్టేషనుకు ఆరు మైళ్ల దూరంలో ఉంది రామాపురం. ప్రయాణ సౌకర్యాలు లేని పల్లెటూరు. మొత్తంమీద ఆ గ్రామంలో రెండు వందల గడప ఉంటుందేమో? అందులో భూమీ పుట్రా ఉన్న రెడ్డి కుటుంబాలు సుమారు యాభై ఉంటాయి.

'లచ్చి ఏటి సేత్తా ఉంటదో? ఎన్నాళ్లయి పోనాది! దిగుల్తో సగమైపోయి ఉంటాది.' ముత్యాలు ఆలోచనలన్నీ లచ్చిమీదనే ఉన్నాయి.

'నేను కాపడగానే లట్టే వొచ్చి గుండెలమీద వాలిపోతాది.సంతోసంతో కన్నీలెట్టుకుంటది.'

ఎండిపోతున్న పొలాలను, కారుమబ్బుల్ని చూసి ఆనందంతో ఊగులాడుతూన్నట్టుగా ఉంది అతని హృదయం ఇప్పుడు. ఆలోచనలకంటే వేగంగా నడుస్తున్నాడు అతను.

• • •

రామాపురంలో తెల్లవారుతూన్న సూచనగా అకు-

డక్కడ కోళ్ళు అరుస్తున్నాయి.

ఒక చిన్న తాటాకు ఇంటిముందు నిలుచున్నాడు ముత్యాలు.

"లచ్చీ...లచ్చీ" అంటూ నాలుగైదుసార్లు తలుపు తట్టి పిలిచాడు.

ఎందుకనో జవాబు రాలేదు.

'పాపం...నాకోసం సూసి, సూసి ఇప్పుడే కన్ను మూసి ఉంటాది' అనుకుంటూ సన్నగా నవ్వు కున్నాడు ముత్యాలు.

అతను ఎన్నిసార్లు పిలిచినా ఇంట్లో ఎక్కడా కదలిక వినిపించలేదు. ముత్యాలు కనుబొమలు ముడివడ్డాయి. వెదురుపేళ్లతో అమర్చిన తలుపు ముందుకు నెట్టాడు. కటకటలాడుతూ వెంటనే తలుపు తెరుచుకుంది. నీతి లేని కామంలాంటి చీకటి ఇంటినిండా రాజ్యం చేస్తూంది.

ముత్యాలు కొద్ది క్షణాలు అలాగే నిలుచున్నాడు. లచ్చిని మరో రెండుసార్లు పిలిచాడు. జవాబుగా అతని పిలుపులే వినిపించాయి. ఆఖరికి అతని గొంతుకు నొప్పి కలిగింది.

ఆలోచనల సాలెగూట్లో అతను ఇరుక్కున్నాడు.

దీపం వెలిగించి గూట్లో ఉంచాడు. వెలితిగా ఉన్న నులకమంచం అతన్ని వెక్కిరిస్తూంది.

తెగని ఆలోచనలతో అతను విసుగ్గా పచార్లు చేస్తున్నాడు.

'నా లచ్చి ఏది?'

'యాడికి పోయింది నా లచ్చి?'

'ఎందు కెల్లింది?'

తాను రాగానే లచ్చి కనిపించలేదనే సన్నని కోపము, కనిపించకుండా ఇంత రాత్రిపూట ఎక్కడికి వెళ్లింది? అనే బాధతో కూడిన అనుమానము అతన్ని పీకు తున్నాయి. భారంగా వచ్చి మంచంమీద చతికిలబడ్డాడు.

కాలం నెమ్మదిగా కదులుతూంది.

ఇంకా లచ్చి రాలేదు!

తాను ఊరినుంచి ఇంటికి వచ్చిన వెంటనే గుండెల మీద వాలిపోతుం దనుకొన్న లచ్చి ఇంట్లోనే లేకుండా ఎక్కడికో వెళ్లిపోయింది.

'ఎక్కడికి' అన్న ఆలోచన అతణ్ణి మరీ మండి స్తూంది.

'ఇంట్లో ఉండకుండా ఎక్కడికి పోయిం దీ రేత్తి రేల? ఎందు కెల్లాలి?' అని ఎన్నిసార్లు ప్రశ్నించు కున్నా సరిఅయిన సమాధానం రావడం లేదు.

మూడు రోజుల తరవాత తెల్లవారింది.

లచ్చి ఇంకా రాలేదు.

ముత్యాలు ఎందుకో దీర్ఘంగా నిట్టూర్చి గుమ్మం వైపు కదిలాడు.

"వొచ్చావురా, ముత్తాలూ." అంటూ గుమ్మంలో ఎదురయింది సూరమ్మ. అంతలోనే బావురుమని ఏడవడం ప్రారంభించింది. ముత్యాలుకు ఇదేమీ అర్థం కాలేదు.

"ఏటి జరిగిం దత్తా? ఏ టలా గేడుత్తావు?" అని ఓదారుస్తూ అడిగాడు.

"లచ్చి...లచ్చి..."

"సెప్పు. లచ్చి కేమయింది?" ఆదుర్దాగా అడి గాడు ముత్యాలు.

"లచ్చి...లచ్చి... సచ్చిపోయిందిరా" అంటూ

**తప్పు చేసినవారు తప్పించుకుపోవడమే పరిపాటి అయినా శిక్ష అనుభవించే యోగం మాత్రం ఎప్పుడో ఒకప్పుడు పట్టక తప్పదు. చిత్రమేమంటే పలుసందర్భాలలో ఈ లోకంలో తప్పు చేసేది ఒకరు; శిక్ష అనుభవించేది మరొకరు.**

బావురుమంది సూరమ్మ.

ముత్యాలు గుండెలోకి ఎర్రగా కాల్చిన గునపం ఒక్కసారిగా దిగబడినట్లయింది.

"ఆఁ! లచ్చి సచ్చిపోయిందా?" అంటూ గట్టిగా అరిచాడు.

"ని కోసం సూసి సూసి అంతా కానిచ్చేశాను" అని సూరమ్మ రుద్ధకంఠంతో చెబుతూంది.

"నా లచ్చి సచ్చిపోయిందా? నిజమే? సెప్పు ఏటి జరిగిందో సెప్పు" అని దాదాపుగా ఏడుస్తూనే అడిగాడు.

దుఃఖాన్ని ఆపుకుంటూ చెబుతూంది సూరమ్మ. జరిగినదంతా నెమరువేసుకుంటూ, కన్నీళ్లను ఆపు కోడానికి ప్రయత్నిస్తూ బొంగురుపోయిన గొంతుతో చెబుతూంది ఆమె.

కన్నీటి ప్రవాహంలో కొట్టుకుపోతున్న ముత్యాలు అంతా విన్నాడు. బేలగా బావురుమని ఏడవడం ప్రారం భించాడు.

"లచ్చీ నన్నిడిసి పోయావా? నన్నిడిసి పోయావా?" అని రోదిస్తూ ముఖాన్ని చేతులతో కప్పుకున్నాడు.

అతని హృదయం దుఃఖంతో చుట్టబెట్టుకు పోతూంది.

"అయ్యో! నే నెట్లా బతకను లచ్చీ! నన్నిడిసి పోయావా లచ్చీ" అని వాపోయాడు.

సూరమ్మ ఓదార్పు వాక్యాలు అతణ్ణి దరిచేర్చలేక పోతున్నాయి.

"బాబూ ముత్తాలూ ఊరికో పోయినోళ్ళు తిరిగి రారుగందా"

ముత్యాలు గుండె అవిసేలా రోదిస్తూనే ఉన్నాడు.

• • •

'రెడ్డీ, ఎంత పని సేశావు? నువ్వు మనిషివి గాదు. గొడ్లేనా నయం నీకన్నా. నా లచ్చిని పొట్ట నెట్టుకున్నావు. నిన్నేం సెయ్యాలి? నా లచ్చి సచ్చిపోయింది. నా పేనాలు తోడేత్తన్నావు. నిన్నేం సేసినా పాపం లేదురా.'

దుఃఖమూ, ఆవేశమూ ముత్యాలు హృదయం నిండా పేరుకున్నాయి. రెడ్డిమీద అమితమైన కోపం, ప్రాణ ప్రదమైన లచ్చికోసం దుఃఖం వీటి మధ్య అతను కుంగిపోతున్నాడు. అతని గుండెల్లోంచి కనిపించని రక్తం స్రవిస్తూంది.

'నిన్ను నా గుండెల్లో దాసుకున్నాను. నువ్వే నా పేనం అనుకున్నాను. నన్నొదిలేసి యేడకి పోనావు లచ్చీ? నిన్నొదిలి నే నెట్టా బతికేది? నువు లేందే నాకు సుకమేది? నీతోటే నేనూ వొచ్చేత్తా. నీ కూడా రానియ్యవూ?'

మహానదులకైనా ఆనకట్టలున్నాయేమో కాని అతని దుఃఖ ప్రవాహానికి అడ్డు లేకపోతూంది.

'ఛీ! నీకు గేనం లేదు. నా లచ్చిని సంపేశావు. నువ్వే సంపేశావు నా లచ్చిని. నీ కే మపకారం సేశాను నేను? నన్నెందు కిట్టా ఏడిపిత్తావు? నా లచ్చి నెందుకు సంపావు?'

మరొక వెంపు రెడ్డిమీద కోపము, అసహ్యము అతని హృదయంలో స్థిరంగా నిలిచిపోయాయి.

'అవును అవును లచ్చీ, ఆడే నిన్ను సంపేశాడు. నా గొంతు కోశాడు. అబ్బా...ఆణ్ణి ఏం సెయ్య మంటావు, లచ్చీ? నువ్వే సెప్పు—నీకూ, నాకూ ఇంత అన్యాయం సేసిన ఆ రెడ్డిగోణ్ణి ఏం సెయ్యమంటావో సెప్పు.'

ముత్యాలు ఆవేశంతో ఊగిపోతున్నాడు.

'సెప్పు, లచ్చీ, ఆణ్ణి ఏంసెయ్యను?'

అంతలోనే మళ్లీ ఆవేదన! అంతలోనే ఆవేశం! అతని నరనరం నలిగి పిప్పిగా తయారవుతూంది. బరువుగా కనురెప్పలు మూసుకొని కూర్చున్నాడు.

"మాఁవాఁ మాఁవాఁ" అనే లచ్చి పిలుపు ముత్యాలు మనస్సులో వినిపించింది.

చుట్టూ చూశాడు. అతి సమీపంలో మంచంమీద కూర్చున్న లచ్చి చేతులు చాచి తనను పిలుస్తున్నట్టు కనపడింది. ముత్యాలు ఆమె కౌగిట్లో వాలిపోయి బావురుమన్నాడు.

"ఇంతసేపూ ఏడకి పోయావు లచ్చీ నువు సచ్చి పోయావనుకున్నాను" అని రుద్ధకంఠంతో అడు గుతూ ఆమె ముఖాన్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు.

లచ్చి ఏదో చెప్పడం ప్రారంభించింది. అతను వింటున్నాడు. మాటమాటకీ ఆమెను గుండెల కదుము కుంటున్నాడు.

"అట్టాగే అట్టాగే లచ్చీ, నువు సెప్పినట్టే సేత్తాను. నా మాట నమ్ము. ఆ తరవాతే నీ కాడ కొత్తాను" అంటూ ముత్యాలు ఆమె చేతిలో చెయ్యి వేశాడు. అతని చెయ్యి తపీమని మంచం పట్టెకి తగిలింది. మంచం మీద లచ్చి లేదు!

ముత్యాలు దిగ్గున లేచాడు.

"లచ్చీ లచ్చీ" అంటూ గట్టిగా, బాధగా పిలిచాడు. లచ్చి పలకలేదు.

• • • •

కళ్ళు మూసుకుని వాలు కుర్చీలో శయనించి, అను భవాల అనుభూతుల్లో మునిగి ఉన్న రెడ్డి దిగ్గున లేచి నుంచున్నాడు.

'ఏమిటి? నా గుండెలమీద ఏమి టింత బరువుగా పడింది?' అనుకుంటున్నాడు. అతని ఆలోచన పూర్తికాలేదు. ఎదురుగా నిలుచుని క్రోధంతో మండి పోతున్న ముత్యాలును చూశాడు. ముత్యాలు ఆకారం అతనిలో ఎందుకో బెరుకు పుట్టించింది.

"ఒరేయ్, ఏమిట్రా ఇది? ఇక్కడి కెందుకు వచ్చావు? హద్దులో నిలబడాలని మరిచిపోయావా? మాల

**ఆకొండి వెంకటరత్నం**

అనన్య సామాన్య ప్రచారంగల తెలుగు వారపత్రిక
ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక




# మంచు నీరయింది

వెధవా, నువ్వేనా నా మీద చెయ్యి చేసుకున్నది? నడు బయటికి?'' అంటూ గర్జించాడు రెడ్డి.

ఇల్లు దద్దరిల్లిపోయేలా నవ్వాడు ముత్యాలు.

''అవును. నేనే నిన్ను కొట్టింది. నా దెబ్బతో నువ్వు పాడుసేసిన ఆడాళ్లందరూ, మాలాళ్లు అందరూ పారిపోయారుకదూ నీ గుండెల్లోంచి? తెలిసిందా నా దెబ్బ సత్తువ? ఇదిగో, ఈ కత్తితో నీ పీక తెగి ఈతల పడాలంటే ఎన్ని మాట్లు నరకాలంటావ్?'' అంటూ చేతిలో ఉన్న పదునైన వంక కత్తిని రెడ్డి కళ్లముందు ఉంచాడు ముత్యాలు.

ఆ దెబ్బతో పిరికి దయ్యం రెడ్డి శరీరంమీద పూర్తిగా వాలింది. కళ్లముందు కదులుతున్న కత్తివంక ఓసారి భయం భయంగా చూశాడు.

''ఏయ్, ఏమిట్రా ఇది? ఏమిటేది? నడు బయటికి ముందు!'' బింకంగా ఉండడానికి ప్రయత్నిస్తూ రెడ్డి అరిచాడు.

''నడుత్తాను. ముందు ని న్ని లోకంలోంచే నడిపించి, నీకు బుద్ధి సెప్పి నడుత్తాను. ముందు నా లచ్చి నేం జేశావు సెప్పు?''

''ఏమో ఎవడికి తెలుసు? ముం దిక్కడినుంచి పో బయటికి. నా కంచం దగ్గిర కూడు తింటూ నన్నే ఎదిరిస్తావుట్రా? పో'' అన్నాడు లేని ధైర్యాన్ని పోగుచేసుకోడానికి ప్రయత్నిస్తూ రెడ్డి.

''ఏయ్!'' అంటూ గర్జించాడు ముత్యాలు.

''నీకు నౌకరుగా ఉంటూ, నువ్వు సెప్పినట్టే ఇంటూ ఇన్నాళ్లూ ఉన్నాను. నువ్వు ఇలాటి గోరం సేశాక నీ మా టెవ డింటాడు? నా లచ్చిని పాడు సేశావు. అది అవమానంతో నూతిలో పడి సచ్చిపోయింది. నన్ను నమ్మించి గొంతు కోశావు. లచ్చి ఏటయిందో నీకు తెలీదూ? దాని సావుకు కారణం నువ్వుకాదూ?'' అంటూ కోపంగా రెడ్డి జుట్టు పట్టుకొని ముందుకు గుంజాడు. ఆ ఊపుకు రెడ్డి బోర్లా పడ్డాడు.

''సెప్పు. నా లచ్చి నేం సేశావో నీ నోటంటే సెప్పించి నిన్ను సంపాలి'' అంటూ రెడ్డి జబ్బ పుచ్చుకుని పైకెత్తాడు.

రెడ్డి ధైర్యం అంతా పూర్తిగా కరిగిపోయింది. పారిపోవడానికి దిక్కులు చూస్తున్నాడు. అతని నరాలు స్వాధీనం తప్పుతున్నాయి. కాళ్లు దడదడలాడుతున్నాయి.

''మాటాడవేం?'' అంటూ కత్తి ఎత్తాడు ముత్యాలు.

''చెబుతాన్రా చెబుతా'' — హఠాత్తుగా భయంగా అరిచాడు రెడ్డి. అటు ఇటు దిక్కులు చూస్తున్నాడు.

''ఏయ్ పారిపోదామని సూత్తన్నావు గావాలు. పానం ఉండగా నా ముందునుంచి పోలేవు నువ్వు. వెయ్యిమంది అడ్డమొచ్చినా నువ్వు సచ్చి తీరతావు.'' ఉరుములాంటి ముత్యాలు అరుపు విని రెడ్డి భయంతో గడగడా వణికిపోతున్నాడు. ముత్యాలు చేతుల్లోంచి

తప్పించుకోగలననే ఆశ సన్నగిల్లిపోయింది రెడ్డిలో.

"చెప్పు నీ నోటితో అంతా చెప్పెయ్యి."

"ఒరేయ్ ముత్యాలూ"

"ఏయ్"

"చెబుతా(నా. నీ ఒచ్చి చచ్చిపోయిందిరా" అని రెడ్డి గొంతు కీచుగా పలికింది.

"చచ్చిపోయిందా? నువ్వు కాదూ చంపుత?"

"నే నా?"

ముత్యాలు మళ్లీ కత్తి పైకెత్తి బలంగా ఝళి పించాడు. రెడ్డి జుట్టు గుప్పెట్లో పెట్టుకున్నాడు.

"నీ సుకం కోసం నా ఒచ్చిని పాడుసేసిన నువ్వు కాదూ దాని సావు క్కారణం? నిజం చెప్పెయ్యి."

"ఒరేయ్ నన్ను చంపుతావ(టూ?" దీనంగా బొంగురు గొంతుతో (ప్రార్థిస్తున్నట్టుగా అడిగాడు రెడ్డి.

"అడిగింది చెప్పు ముందు" అంటూ రెడ్డి కళ్ల ముందు నెమ్మదిగా కత్తి కదిలించాడు ముత్యాలు.

"నిజవేఁ నువ్వు చెప్పింది నిజమే. నేనే నీ భార్య చావుకుకారణం" అని ఇంకా ఏదో చెప్పబోయాడు రెడ్డి.

"తలుసుకో బేగా దేవుణ్ణి తలుసుకో. నిన్ను బేగా సంపితేనే కాని నేను ఒచ్చి దగ్గిరికెళ్లగూడదు" అంటూ కత్తిని బలంగా పట్టుకున్నాడు ముత్యాలు.

"ముత్యాలూ! నిజం ఒప్పుకున్నాను కదురా. నన్ను వదిలెయ్. నన్ను చంపితే నీకే మొస్తుందిరా?"

"నిన్ను సంపకపోతే ఇంకా ఎందర్ని పాడుసేత్తావో నాకు తెలీదంట! నువ్వు సచ్చితీరాలి. తల్సుకో దేవుణ్ణి."

రెడ్డి అభిమానాన్ని వదులుకుని పూర్తిగా బతిమ లాడదలుచుకున్నాడు. అతని కళ్లలో నీళ్లు తిరుగు తున్నాయి.

"నన్ను చంపద్దు ముత్యాలూ!నీకు వెయ్యి రూపాయ లిస్తాను. హాయిగా బ...కుదువుగాని."

"ఛీ! నీ పాపిట్టి డబ్బెవడి క్కావాలి? నా ఒచ్చిని ఇత్తావా? నా ఎత్తు బంగారం ఇచ్చినా ని న్నొదల్ను. థూ" అంటూ కాండ్రించి ఉమ్మాడు ముత్యాలు.

"ఊఁ ఆలేసెం సెయ్యకు. దేవుణ్ణి తల్సుకో" అంటూ కత్తి పైకెత్తాడు.

రెడ్డి నిలువెల్లా వణికిపోతూనే ఉన్నాడు. ఒక్క సారిగా ముత్యాలు కాళ్లను చుట్టేసుకుని బావురు మన్నాడు.

"ముత్యాలూ! నీ ఒచ్చి తిరిగిరాదు కదురా నేను చచ్చినా. నన్ను బతకనియ్యి. చచ్చి నీ కడుపున పుడ తాను."

"ఛీ! నువ్వు నా కడుపు నెందుకు? నువ్వే కనక నా కడుపున పుడితే ఎంటనే మళ్లీ సంపేత్తాను. లే. దేవుణ్ణి తల్సుకో."

"ముత్యాలూ, నీ కాళ్లమీదపడి బతిమాలుతున్నాను. నన్నొదిలెయ్, నేను లేకపోతే నా పెళ్లాం, పిల్లలూ దిక్కులేనివా ళ్లయిపోతారు. చెట్టుకూ పుట్టకూ చెదిరి పోతారు. నీకు దండం పెడుతున్నాను ముత్యాలూ. నన్నొదిలెయ్. నా పెళ్లాం, పిల్లల్ని గురించి ఒక్కసారి ఆలోచించు. నీ కా ళ్లట్టుకున్నాను. నన్ను చంపకు" అంటూ ముత్యాలు కాళ్లను గట్టిగా కౌగిలించుకుని బావురుమని ఏడవడం మొదలు పెట్టాడు రెడ్డి.

"నన్ను గురించి ఒక్క పాలేనా ఆలోసించావా? నా ఒచ్చి నెందుకు పాడుసేశావు? రెడ్డీ, నువ్వు సచ్చి తీరాలి. నా కసి తీరాలి. ఆకరుసారి సెబుతున్నాను. నిమసంలో నువ్వు సచ్చి తీరతావు. తలుసుకో—దేవుణ్ణి తలుసుకో. నిన్ను సంపాలి. నా పగ సల్లారాలి" అంటూ కత్తి పైకెత్తి రెడ్డి జుట్టు బలంగా పట్టుకొని పైకి లాగాడు.

అడుగంటిపోయిన ఆశలతో రెడ్డి నోరు కూడా మూసుకుపోయింది. నిశ్శబ్దంగా, భయంతో వణు కుతూ గట్టిగా కళ్లు మూసుకుని నిలుచున్నాడు.

ముత్యాలు ఓసారి వికటంగా నవ్వాడు.

"నా పగ తీరుతాంది" అంటూ బలంగా కత్తి పైకెత్తాడు.

"ముత్యాలూ!"

అది రెడ్డి కంఠం కాదు. అతని భార్య సీత గంభీరంగా పిలిచిన పిలుపు.

ముత్యాలు ఆగిపోయాడు. చటుక్కున కోపంగా ఆమె వైపు చూశాడు.

గుమ్మంలో నిలుచుని సూటిగా ముత్యాలు ముఖం లోకి చూస్తోంది సీత. ఆమె హృదయం నిశ్చలంగా ఉంది. ఆమె ముఖంలో ఏ కోశానా భయం అనేదిలేదు. ముత్యాలు ఇంకా అలాగే చూస్తున్నాడు.

సీత నిశ్చలంగా ముత్యాలు ముఖంలోకే చూస్తూ బరువుగా నడుస్తూ ముందుకు వస్తోంది. ఈసారి ముత్యాలు ఆమె ముఖంలోకి చూడలేకపోయాడు.

"ముత్యాలూ" అని పిలిచింది సీత. ఆమె గొంతులో వంద కంఠాల గాంభీర్యం తొణికిసలాడింది.

"ఊఁ, ఏటి?" అన్నాడు ముత్యాలు నిశితమైన కత్తివంక చూస్తూ.

రెడ్డి కళ్లు తెరిచి చూశాడు. అతని మెదడు (ప్రాణరక్షణ కోసం పరికిస్తోంది.

"ఇలా చూడు, ముత్యాలూ!"

"ఊఁ. సెప్పు" అన్నాడు ముత్యాలు సీతవైపు చూడకుండానే.

"ఆయనమీద పగ తీర్చుకోవాలనే కదూ నీ కోరిక?"

"అవును. నీ మొగుడు సావాలి. నా పగ తీరాలి." పిడికిలి బిగిస్తూ గట్టిగా అన్నాడు ముత్యాలు.

"నే నొక చిన్న విషయం చెబుతాను వింటావా?"

"ఊఁ బేగా సెప్పు."

రెడ్డి నెమ్మదిగా జారుకోడానికి వెనక్కి జరుగు తూండడం ముత్యాలు గమనించాడు.

"ఏయ్, రెడ్డీ! పిరికోడిలా పారిపోకు" అంటూ అతని జబ్బ పుచ్చుకుని గట్టిగా కుదిపాడు.

రెడ్డి వణుకుతూ నిలబడిపోయాడు.

"నేను చెప్పే నాలుగు మాటలు విను, ముత్యాలూ! తరవాత నీ ఇష్టం."

"బేగా సెప్పు. నా ఒచ్చి పిలుత్తూంది."

"ముత్యాలూ, నీ భార్య చావుకు ఆయన కారణ మయ్యారు కనక నువ్వు ఆయన్ని చంపుతానంటున్నావు. అంతేగా?"

"అవును."

"అది అన్యాయం కాదా?"

"అన్నాయమా?" అంటూ గట్టిగా అరిచాడు

---

# మబ్బులో జాబిల్లి

## కోపల్లె శివరావు

మబ్బులో జాబిల్లి
మనకేసి పోయాడు,
కలువ కన్నియ మనసు
కలత పడుతూంది.

మన... మదికోచి
మమత గొల్పిన బావ!
మదిలోని మాలతీ
మధుదేవ! రావా!

ఏ తావు చూ...
ఏతావి వీచినా
నీ రూపు నీ చాయ
నీ మూర్తి కనిపించు.

మదిలోన నీ మాట
మెదలిన ట్లుంటాది.
మనకేసి నువులేక
మనసు నీరవుతాది.

చుక్కా రాణుల రాజు
వెక్కిరించును నన్ను
నా ఆశవలె నీట
అడుగంటినవి అలలు

కలువ కన్నియ వోలె
పలవరించే నన్ను
చలువ చూపుల బావ
పలకరిస్తావా?

నీ మాట, నా పా...
నీటిలో మూటలా
కన్నీటి కెరటాల
కరగిపోయేనా! *

ముత్యాలు.

''కాదా మరి? నేరం ఒకళ్లు చేస్తే శిక్ష మరొకళ్లకు ఎలా విధిస్తావు? నువ్వు వేసిన శిక్ష ఆయన అనుభవించద్దా? నువ్వు చంపగానే కాస్త బాధపడి ఆయన చచ్చిపోతారు. ఆయన చనిపోయినందుకు నేను బాధపడాలి. అవునా?''

''అవును.''

''నీ భార్య చచ్చిపోయినందుకు నువ్వు బాధపడ తున్నావు. ఆయనను చంపుతానంటున్నావు. కాని, తరవాత జీవితాంతం నేను కదా బాధపడేది? ఆ శిక్ష నాకు కాదూ? ఆయన పడే బాధ నీ కెలా తెలుస్తుంది? నువ్వు ఆయన్ని చంపే సమయంలో ఆయన పొందే శారీరిక బాధ మాత్రం చూస్తావు. తరవాత ఆయనకు ఏ బాధా ఉండదు. కాని, ముత్యాలూ, నేను — నేనే అనుభవించాలి ఆ తరవాతి బాధను. ఆ శిక్ష నాకు విధిస్తున్నావు, ముత్యాలూ, ఇది అన్యాయం కాదా?''

''ఏటో? నా కదేం తెలదు.''

''ఆలోచించు, ముత్యాలూ! ఆయన నీ భార్య చావుకు కారణం అయినప్పుడు నువ్వు ఆయన భార్య చావుకు కారణం కావాలి. నువ్వు ఆయన భార్యను చంపాలి. అప్పుడు నువ్వు నీ భార్యను పోగొట్టుకొని ఎంత బాధ పడుతున్నావో ఆయనకు తెలుస్తుంది. వియోగంలో ఎంత ఆవేదన ఉందో ఆయనకు అర్థమవుతుంది. అప్పుడే ఆయన గుండెలు బాగా మండుతాయి. అప్పుడు ఆయనకు శిక్ష విధించినవాడి వవుతావు నువ్వు. అప్పుడే నీ పగ చల్లారినట్టు. ఆయనను చంపేస్తే జీవితాంతం ఆయన కూడా నీలా బాధపడేది ఎప్పుడు? నీ పగ చల్లారదు. ముత్యాలూ, నేరంచేసిన వాళ్లనే శిక్షించాలి. ఆలోచించు.''

ముత్యాలు సీత ముఖంలోకి ఓసారి చూశాడు. ఆమె గుడ్ల నిండా నీరు నిండి ఉంది.

''ముత్యాలూ! నా మాటలు అర్థమవలేదా? నువ్వు చంపవలసింది ఆయన్ని కాదు. నన్ను. నన్ను చంపు. నీ పగ చల్లారుతుంది. నేను పోయాక నా కోసం ఆయన ఎంత గట్టిగా ఏడుస్తారో చూద్దువు కాని. నీకు అప్పుడే శాంతిగా ఉంటుంది. భార్యా వియోగం ఎంత బాధగా ఉంటుందో ఆయనకు అర్థం కావాలి. ఇంక ఆలోచించకు, ముత్యాలూ? నన్ను చంపు'' అన్నది సీత. పైటతో ఒకసారి కళ్లు ఒత్తుకుని రెండడుగులు ముందుకు వేసింది.

ముత్యాలు ఆమె ముఖంలోకి వెర్రిగా, కసిగా చూస్తూ కత్తి పైకెత్తాడు.

''రా, ముత్యాలూ! సందేహించకు. నీ పగ చల్లారుతుంది. నేను సుమంగళిగా చనిపోయాననే తృప్తి మిగులుతుంది. నా భర్తను చూస్తూ ఆనందంగా ప్రాణాలు విడుస్తాను'' అంటూ మరొక అడుగు ముందుకు వేసింది సీత.

''నీ బాధ నాకు తెలుసు, ముత్యాలూ! నీ ఎచ్చి తన అపవిత్ర దేహాన్ని నీకు చూపించలేక ఆత్మహత్య చేసుకుంది. నా బాధ కూడా నువ్వు తెలుసుకో. నా భర్తకు బదులు నన్ను చంపు. నా మాంగల్యాన్ని తెంపకు. నన్ను చంపు'' అంటూ మరో అడుగు వేసింది.

''సీతా, ఏమి టిది?'' బాధగా అంటూ రెడ్డి ఆమెవైపు నడిచాడు.

బరువుగా కనురెప్పలు ఎత్తి భర్త ముఖంలోకి చూసింది సీత.

''నన్ను అడ్డుపెట్టకండి. ఇలాగే చచ్చిపోనియ్యండి. భర్త ఎదురుగా చనిపోవడం భార్యకు ఆనందం కాదూ? భర్త చావు ఏ భార్య చూసి సహించగలదు చెప్పండి? నన్ను ఆపు చెయ్యకండి. ముత్యాలూ, నేను సిద్ధంగా ఉన్నాను'' అంటూ సీత కళ్లు మూసుకుని మౌనంగా దైవప్రార్థన చేసుకోసాగింది.

'ఓ మొగాడి మీది కోపంతో ఓ ఆడదాన్ని సంపాలి! అవును సంపాలి...' అనుకుంటున్నాడు ముత్యాలు. ముత్యాలు ఎత్తిన కత్తి ఎత్తినట్టే ఉంది.

''నన్ను చంపు, ముత్యాలూ! నీ పగ తీర్చుకో'' అంది సీత కళ్లు తెరవకుండానే.

ముత్యాలు రెండడుగులు ముందుకు వేశాడు. ఇంకొక అడుగులో కత్తికి సరీగా అందుతుంది సీత.

''ముత్యాలూ!'' అని గట్టిగా, వేదనాపూరితంగా అరుస్తూ రెడ్డి ముత్యాలు కాళ్లమీద పడ్డాడు.

''వొద్దు వొద్దు, ముత్యాలూ! నా సీతని చంపకు. కావాలంటే నన్నే చంపు. నేనే ముత్యాలూ నేరం చేసింది. నన్ను చంపు'' అంటూ ఏడుస్తూ బతిమాలుకున్నాడు.

''ముత్యాలూ! వొద్దు, వొద్దు. ఆయన్ని చంపొద్దు. నన్ను చంపు'' అన్నది సీత ఆదురాగా.

చాలాసేపటినుంచీ సీత ముఖంలోకే చూస్తూ ఉన్నాడు ముత్యాలు. అతని చేతిలో కత్తి ఎత్తినది ఎత్తినట్టే ఉంది.

'మగాడి మీది పగతో ఆడదాన్ని సంపాలా?' అని అడుగుతూంది అతని హృదయం.

''ముత్యాలూ!'' అంటూ మళ్లీ ఓసారి హెచ్చరించి సీత కళ్లు మూసుకుంది.

'నా సెయ్యి కదలదం లేదేం? నాకు ఇట్టా ఉందేటి?' శూన్యంలోకి చూస్తున్న ముత్యాలు ఎదేపదే ఇలాగే ప్రశ్నించుకుంటున్నాడు.

రెడ్డి ముత్యాలు కాళ్లు చుట్టుకుని దీనంగా ఏడుస్తూ బతిమాలుతున్నాడు.

సీత మాటిమాటికి హెచ్చరిస్తూంది.

ముత్యాలు ఒక్కసారి రెడ్డిని గట్టిగా విదిలించాడు. తూలిపోయిన రెడ్డి, ''ముత్యాలూ! నా సీతను చంపద్దు'' అని కన్నీళ్లతో ప్రార్థిస్తూ లేచి ముందుకు రాబోయాడు.

''రెడ్డీ! నువ్వు ఇటేపు రాకు.'' రెడ్డి ముఖంలోకి చూస్తూ అన్నాడు ముత్యాలు.

నాలుగడుగులు వేసి చటుక్కున కత్తి రెండు చేతుల్లోనూ పట్టుకున్నాడు.

''ముత్యాలూ!'' అని మళ్లీ హెచ్చరించింది సీత.

రెడ్డి నిస్సహాయంగా నిలబడిపోయి కన్నీళ్లతో భార్య ముఖంలోకి చూస్తున్నాడు.

సీతకు బాగా దగ్గరగా వెళ్లిన ముత్యాలు దబుక్కున ఆగిపోయాడు. చేతులో ఉన్న కత్తిని నిశ్శబ్దంగా ఆమె పాదాల ముందు ఉంచి గిరుక్కున వెనక్కి తిరిగాడు. బరువుగా, వేగంగా అడుగులు వేస్తూ సావిట్లోంచి ఇవతలికి వచ్చేశాడు.

''ఎచ్చీ! నేనూ వత్తున్నా నేనూ వత్తున్నా'' అంటున్నాయి అతని బరువు గుండెలు.

వెళ్లిపోతున్న ముత్యాలువైపు కొయ్యబొమ్మలా చూస్తూ నిలుచుండిపోయాడు రెడ్డి. అతని కళ్లు మాత్రం బొటబొటా నీళ్లు కార్చాయి.

''ముత్యాలూ! ఆలస్యం చెయ్యకు'' అన్నది సీత.



లంబాడి లలన
చిత్రం — ఎమ్.ఆర్.ఎన్.ప్రసాదరావు (మద్రాసు-17)

''సీతా, పాపం! ముత్యాలు వెళ్లిపోతున్నాడు'' అన్నాడు రెడ్డి బొంగురు పోయిన గొంతుతో.

సీత కళ్లు తెరిచింది. ఎదురుగా ముత్యాలు లేడు. భర్తమాత్రం నిర్లిప్తంగా వీధిలోకి చూస్తున్నాడు. ఆమె కళ్లు అప్రయత్నంగా వర్షించాయి.

వీధిలో ముత్యాలు ఒంటరిగా, భారంగా వెళ్లిపోతూ కనిపించాడు.

తెల్లవారి చాలాసేపయింది.

ప్రకృతి నిండా ముసుగు వేసిన మంచు బిందువులు ఉదయిస్తూన్న సూర్య కిరణాలను ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని వాటిలో ఐక్యమై పోతున్నాయి. ★